# టైమ్స్ ఆఫ్ వార్త

ఎడిటర్ : గూడూరు జనార్ధన్ రెడ్డి

తెలుగు దినపత్రిక

తెలంగాణ | ఆదివారం, 09 - జూన్ - 2024 | సంపుటి : 16 | సంచిక : 326 | పేజీలు 05 | వెల : 6/-


## కాంగ్రెస్ లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా
# రాహుల్ గాంధీ..

### ప్రకటించిన కేసీ వేణుగోపాల్..



**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**
కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీని ఆ పార్టీ లోక్‌సభ ఫ్లోర్ లీడర్‌గా బాధ్యతలు చేపట్టాలని సీడబ్ల్యూసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ తెలిపారు. శనివారం నాడు ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీ అయ్యింది. సుమారు మూడు గంటల పాటు ఈ సమావేశం సాగింది. సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న నిర్ణయాల గురించి కేసీ వేణుగోపాల్ మీడియాకు వెల్లడించారు. సిడబ్ల్యూసీ సమావేశంలో లోక్‌సభ ఎన్నికలపై, ఎన్నికల ఫలితాలపై చర్చించామన్నారు. సీబీఐ, ఈడీ సంస్థలతో కాంగ్రెస్ నేతలను బ్లాక్‌మెయిల్ చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని చెప్పారు. కాంగ్రెస్ పని అయిపోయిందని చాలా మంది కామెంట్స్ చేశారని.. ఎగ్జిట్ పోల్స్‌పై పోరాటం చేశామని కేసీ వేణుగోపాల్ చెప్పుకొచ్చారు.

## నితీశ్ కుమార్‌కి
# ప్రధాని పదవి ఆఫర్?



**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**
లోక్‌సభ ఎన్నికల్లో 2024 ఎన్డీఏ కూటమి మెజారిటీ మార్క్(272)ని దాటి 293 స్థానాలు గెలుపొందడంతో.. మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమవుతోంది. నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తమూ ఖరారైంది. ఇలాంటి తరుణంలో.. దేశ రాజకీయాలను కుదుపు కుదిపేసేలా ఓ రాజకీయ నేత సంచలన ప్రకటన చేశారు. బిహార్ సీఎం, జనతాదళ్ (యు) అధ్యక్షుడు నితీశ్ కుమార్‌కు ప్రధాని పదవి ఆఫర్ చేశారంటూ కుండబద్దలు కొట్టారు. ఆ పార్టీకి చెందిన కేసీ త్యాగి ఓ ఇంటర్వ్యూలో ఈ బాంబ్ పేల్చారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కేసీ త్యాగి మాట్లాడుతూ.. "నితీశ్ కుమార్‌కు ఇండియా కూటమి నుంచి ప్రధాని పదవి ఆఫర్ వచ్చింది. నితీశ్‌ను ఈ కూటమికి కన్వీనర్ అయ్యేందుకు ఎవరైతే అనుమతించలేదో.. ఆ వ్యక్తుల నుంచే ఈ ఆఫర్ ఆయనకు వచ్చింది. కానీ తాను ఎన్డీఏ కూటమిలోనే కొనసాగుతానని చెప్పి, ఆ ఆఫర్‌ని నితీశ్ తిరస్కరించారు" అని చెప్పుకొచ్చారు. మరి, ఈ ఆఫర్ చేసిన నాయకులు ఎవరని ప్రశ్నించగా.. అందుకు జవాబు ఇచ్చేందుకు త్యాగి నిరాకరించారు. ప్రధాని పదవి ఆఫర్‌తో కొందరు నాయకులు నేరుగా నితీశ్‌ని సంప్రదించాలని అనుకున్నారని చెప్పారు కానీ, వారి పేర్లు బయటపెట్టలేదు. తాము ఇండియా కూటమిని విడిచిపెట్టి ఎన్డీఏలో చేరామని, ఇకపై వెనుదిరిగి చూసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

### కాంగ్రెస్ పార్టీ క్లారిటీ

అయితే.. కేసీ త్యాగి వాదనల్ని మాత్రం కాంగ్రెస్ తోసిపుచ్చింది. ఆయన చేసిన వ్యాఖ్యల్లో ఏమాత్రం వాస్తవం లేదని, నితీశ్‌కు ఎవరూ పీఎం పదవిని ఆఫర్ చేయలేదని క్లారిటీ ఇచ్చింది. ఈ అంశంపై కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. "కేసీ త్యాగి చేసిన వ్యాఖ్యల్లో వాస్తవం లేదు. అలాంటి సమాచారం మాకు అందలేదు. నాకు తెలిసి.. కేసీ త్యాగి ఒక్కరికే ఈ విషయం తెలిసి ఉంటుంది" అంటూ సైలెంట్‌గా కౌంటర్ వేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చాక తాము నితీశ్‌కుమార్‌ని సంప్రదించలేదని, ఇదొక అసత్య ప్రచారమని ఆయన ఖరాఖండీగా తేల్చి చెప్పారు

## 'నీట్' అవకతవకలపై విచారణ జరిపించండి

### కేంద్రాన్ని డిమాండ్ చేసిన కేటీఆర్

**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**



నీట్ ఎగ్జామ్‌లో అవకతవకలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు. హై లెవల్ ఎక్స్ పర్ట్ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని కేటీఆర్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన కీలకమైన ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించిన కొన్ని వ్యవహారాలు చూస్తుంటే కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ ఎగ్జామ్‌లో 67 మంది విద్యార్థులు 720కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ సారి చాలా మంది విద్యార్థులు 718, 719 మార్కులు సాధించారు. నీట్‌లో (o4, -1) మార్కింగ్ విధానం ఉంటుంది. ఈ లెక్కన 718, 719 మార్కులు రావటమన్నది సాధ్యమయ్యే పనికాదన్నారు. దీని గురించి ప్రశ్నిస్తే 'గ్రేస్ మార్కులు' ఇచ్చామని చెబుతున్నారు. కొంతమంది విద్యార్థులకు ఏకం గా 100 వరకు గ్రేస్ మార్కులు ఇచ్చినట్లు తెలుస్తోంది. గ్రేస్ మార్కుల కోసం ఏ విధానం అవలంభించారన్నది చెప్పకపోవటం ఆశ్చ ర్యం కలిగిస్తోందన్నారు. నీట్ ఫలితాలను ప్రిపోన్ చేసి ఎన్నికల ఫలితాల రోజే హడావుడిగా విడుదల చేయటం కూడా ఎన్నో అనుమానాలను రేకెత్తిస్తోందన్నారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలకు సంబంధించి చాలా సవాళ్లను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు.

### కష్టపడి పని చేద్దాం.. రాకేశ్ రెడ్డికి ధైర్యం చెప్పిన కేటీఆర్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో నాకు ఓటుతో మద్దతుగా నిలిచిన పట్టభద్రులు అందరికి ధన్యవాదాలు, అందరి అంచనాలకు తగ్గట్టు భవిష్యత్‌లో రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తాను. మీ అంచనాలు చేరుకోలేకపోయినందుకు క్షమించండి అంటూ బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన ఏనుగుల రాకేశ్ రెడ్డి ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మీరు సాధ్యమైనంత వరకు కష్టపడ్డారు. ఫలితాలు ఎప్పుడు కూడా ఆశించినట్టుగా రావు. దృఢంగా, పాజిటివ్‌గా ఉండండి. ఇదే కష్టాన్ని కొనసాగిద్దాం అని కేటీఆర్ రాకేశ్ రెడ్డి ధైర్యం ఇచ్చారు.

# రామోజీరావు ఇకలేరు..

ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ
తెల్లవారు జామున కన్నుమూత
కొంతకాలంగా అనారోగ్య సమస్యలు
రామోజీ ఫీల్మ్‌సిటీకే పరిమితం
మీడియా అధిపతిగా జాతీయ గుర్తింపు
అవార్డులందుకున్న అనేక సినిమాలు
ఆయన పేరుమీదనే ఫిల్మ్ సిటీ ఏర్పాటు..
రేపు చిత్ర పరిశ్రమ బంద్



**టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :**
ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూశారు. శుక్రవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆయనను నానక్‌రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు. 1936, నవంబర్ 16న ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. చిననాటినుంచే విలక్షణ, సృజనాత్మకత కలిగిన ఆయన.. ఈనాడు దినపత్రికను ప్రారంభించి సంచలనం సృష్టించారు. 1974, ఆగస్టు 10న విశాఖపట్టణంలో ఈనాడును ప్రారంభించారు. అనంతరం సితార సినీ పత్రిక, ఈటీవీ చానళ్లను కూడా తీసుకొచ్చి మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఫిల్మ్ సిటీని నిర్మించారు. సినిమా మొత్తాన్ని అక్కడే షూటింగ్ చేసుకునేలా సకల వసతులు కల్పించారు. మరణానికి సంతాపంగా ఆదివారం చిత్ర పరిశ్రమ బంద్ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అక్కడికి తరలివెళ్లి మీడియా సంస్థ అధినేతకు నివాళులర్పిస్తున్నారు. రామోజీ రావు మరణ వార్త సినీ ఇండస్ట్రీని తీవ్రంగా కలచివేసింది. ఈ నేపథ్యంలో రామోజీ మృతి పట్ల సినీ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన మరణానికి సంతాప సూచికంగా ఆదివారం చిత్ర పరిశ్రమకు బంద్ ప్రకటించారు. ఈ మేరకు చలనచిత్ర నిర్మాతల మండలి ప్రకటన విడుదల చేసింది. ఆదివారం అన్ని షూటింగ్‌లూ నిలిపివేస్తున్నట్లు తెలిపింది.

### రేపు రామోజీరావు అంత్యక్రియలు

ఆయన పార్థివదేహాన్ని రామోజీ ఫిల్మ్ సిటీకి తరలించారు. ఇక రామోజీ అంత్యక్రియలు ఆదివారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఫిల్మ్‌సిటీలో ఏర్పాట్లు చేస్తున్నారు.

### రామోజీ మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది
### ప్రధాని నరేంద్ర మోదీ

ప్రముఖ మీడియా ప్రముఖుడు, రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మోదీ రామోజీరావుకు నివాళులు ప్రకటించారు. భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడు రామోజీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యన సహకారం జర్నలిజం, సినిమా ప్రపంచంలో చెరగని ముద్ర వేసిందన్నారు. రామోజీ అవిశ్రాంత ప్రయత్నాల కారణంగా మీడియా, వినోద ప్రపంచంలో ఎన్నో ఆవిష్కరణలు, కొత్త ప్రమాణాలు నెలకొల్పారని వెల్లడించారు. ఈ క్రమంలో రామోజీరావు మృతికి సంతాపం తెలుపుతూ భారతీయ మీడియాను విప్లవాత్మకంగా మార్చిన దార్శనికుడని ప్రధాని మోదీ అభివర్ణించారు. దీంతోపాటు ఆయనతో మాట్లాడటం, ఆయన నుంచి ప్రయోజనం పొందే అవకాశాలు లభించడం నా అదృష్టమని మోదీ అన్నారు. ఈ కష్ట సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు, అసంఖ్యాక అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు చెప్పారు. ఆయన మృతి దిగ్భ్రాంతికి గురిచేసినట్లు తెలిపారు.

### రామోజీ మృతి పట్ల కేసీఆర్, హరీశ్, కేటీఆర్ సంతాపం

ప్రముఖ మీడియా నిపుణులు, రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు(87) మృతి పట్ల తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటు రామో జీ కుంటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేత, మాజీ ఆర్థిక మంత్రి హరీశ్ రావు(కూడా రామోజీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. పత్రికా, టీవీ, సినిమా రంగాల్లో రామోజీ సేవలతో ఎంతో మందికి ఉపాధి లభించిందని గుర్తు చేశారు. దీంతోపాటు రామోజీ శ్రమ, తపన, నిబద్ధత, క్రమ శిక్షణ కల్గిన మంచి వ్యక్తి అని హరీశ్ రావు పేర్కొన్నారు. దీంతోపాటు బీఆర్ఎస్ నేత, మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ కూడా రామోజీ మృతి పట్ల సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. రామోజీ గారి మరణం గురించి తెలుసుకుని చాలా బాధపడ్డానని ఆయన నిజమైన దార్శనికుడని అభివర్ణించారు. ఆయన జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని చెప్పారు. ఎన్నో అసమానతలు ఉన్నప్పటికీ గొప్ప విజయాన్ని ఎలా సాధించవచ్చో ఆయన జీవితం, ప్రయాణం చూస్తే అర్థమవుతుందన్నారు.

### అధికారిక లాంఛనాలతో రామోజీ అంత్యక్రియలు

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతిపై పలువురు ప్రముఖుల సంతాపం వ్యక్తం చెబుతున్నారు. రామోజీ రావు మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించారని గుర్తుచేశారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ప్రకటించారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీచేశారు. సీడబ్ల్యూసీ సమావేశంలో కోసం రేవంత్ ఢిల్లీ వెళ్లిన సంగతి తెలిసిందే. అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించాలని రంగారెడ్డి కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌కు సీఎస్ ఆదేశాలు జారీచేశారు.

### రామోజీ మృతితో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది : రాష్ట్రపతి ముర్ము

ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మరణం పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు ప్రముఖ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సంతాపం ప్రకటించారు. రామోజీరావు మృతితో దేశం ఓ మీడియా దిగ్గజాన్ని కోల్పోయిందన్నారు. 'రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. రామోజీరావు ఓ వినూత్న వ్యాపారవేత్త. ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. తన దూర దృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్ర వేశారు. మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. పద్మవిభూషణ్ అందుకున్నారు.

టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
ఆదివారం,
09-06-2023


# ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

## సర్వేల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉప అధ్యక్షులు సుక్క స్వామి

**టైమ్స్ ఆఫ్ వార్త – సంస్థాన్ నారాయణపురం**



సంస్థాన్ నారాయణపురం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కి మంత్రి పదవి ఇవ్వాలని సర్వేల్ కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపఅధ్యక్షులు సుక్క స్వామిలి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం నాడు విలేకరులతో మాట్లాడుతూ మాట్లాడుతూ అభివృద్ధి అంటే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అని,గత ప్రభుత్వం చేసిన తప్పులకు ఎదురు నిలబడ్డ ఒకే ఒక్క వ్యక్తి రాజగోపాల్ రెడ్డి భువనగిరి నియోజకవర్గం నుండి చామల కిరణ్ కుమార్ రెడ్డిని ముందుండి భారీ మెజారిటీతో గెలిపించిన నాయకుడని తెలిపారు. త్వరలో ఏర్పడే మంత్రివర్గంలో రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తే మునుగోడు నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి ఇంటర్మీడియట్ ఇంగ్లీష్ ప్రాక్టీకల్స్

## ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ

**టైమ్స్ ఆఫ్ వార్త మెదక్ జిల్లా ప్రతినిధి ( బైండ్ల లక్ష్మణ్ )**



ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు కొనసాగింపుగా నేటి ఉదయం 9 నుండి ఇంగ్లీష్ ప్రాక్టీకల్స్ ప్రారంభం కానుంది. గత వార్షిక పరీక్షలో ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ ప్రాక్టికల్స్‌లో అనుతిర్ణులైన విద్యార్థులు, హాజరు కానీ విద్యార్థులు తమ కళాశాలలో తప్పని సరిగా హాజరు కావాలని ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 10 వ తేది ఇంగ్లీష్ ప్రాక్టీకల్స్ తో పాటుగా 11 వ తేదీన ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు పర్యావరణ విద్య 12 తేదీ ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నైతికత, మానవ విలువలు పై పరీక్షలు జరుగుతాయి. పై ఏదేని పరీక్షలో అనుతిర్ణులైతే ఆయా విద్యార్థులు అనుతిర్ణులుగా పరిగణిస్తారు మరియు ఇంటర్మీడియట్ పాస్ సర్టిఫికెట్ ను ఇంటర్మీడియట్ బోర్డు జారీ చేయదు. కావున విద్యార్థులు వారి తల్లి తండ్రులు ఈ విషయాన్నీ గమనించి తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. జిల్లా లో ఉన్న ఇంటర్మీడియట్ కళాశాలల ప్రిన్సిపల్స్ అందరు కూడా పరీక్షా తేదీల సమాచారాన్ని ఆయా విద్యార్థులకు చేరవేసి గతంలో హాజరు కానీ అనుతిర్ణులైన విద్యార్థులు పరీక్షా వ్రాసే విధంగా చూడాలని తెలిపారు.

# ఉపకార వేతనాలకై ఎంపిక పరీక్ష

**టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-**

సివిల్స్ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉపకార వేతనాలు అందించేందుకు కొంగర ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంపిక పరీక్ష నిర్వహించడం జరుగుతుందని సొసైటీ అధ్యక్షుడు గంగాధర్ రావు శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జూన్ 23న ఎంపిక పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పోటీ పరీక్షలకు హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9346777568 నకు సంప్రదించాల్సిందిగా

# జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కలిసిన బోర్లంఎంపీటీసీ పెద్ద పట్లోల శ్రావణి దేవేందర్ రెడ్డి

**టైమ్స్ ఆఫ్ వార్తు– బాన్సువాడ:**



బాన్సువాడ గ్రామీణ మండలం బోర్లం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు లోక్సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించిన జహీరాబాద్ ఎంపీశ్రీ సురేష్ కుమార్ షెట్కర్ నినారాయణఖేడ్ లో స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా శాలువా, పూలమాలతో సన్మానించడం జరిగింది. ఎంపీ మాట్లాడుతూ కార్యకర్తలు అందరూ కష్టపడ గెలిపించినందుకు బాన్సువాడ నియోజకవర్గం ప్రజలకు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఎంపీటీసీ ని అభినందిస్తూ మీరు మాఫ్యామిలీ మెంబర్, నాకు పాత స్నేహితులు అని, తనపాత జ్ఞాపకాలను గుర్తు చేసి మమ్మల్ని అభినందించడం జరిగింది. కార్యకర్తలకు ఏ ఆపద వచ్చిన ఎల్లవేళలా అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, బోర్లంగ్రామ అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీ తెలపడం జరిగింది. అనంతరం కార్యక్రమంలో భాగంగా నారాయణఖేడ్ స్థానిక ఎమ్మెల్యే మా సమీప బంధువు పెద్ద పట్లోలసంజీవరెడ్డి ని సైతం మర్యాద పూర్వకంగా ఆయన స్వగృహంలోకలిసిశాలువాతో సన్మానించడం జరిగింది. మొదటిసారిగా ఆయన నివాసానికి వచ్చినందుకు ఎంపీటీసీకి ముఖ్య నాయకులు ఎమ్మెల్యే శాలువాలతో సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొబ్బురుజనార్దన్ రెడ్డి, ఎంపీటీసీ శ్రావణిదేవేందర్ రెడ్డి,మద్దెంచర్ గంగారం, ఉద్యమ పోడం బాన్సువాడ డివిజన్ ప్రధాన సలహాదారు పెద్ద పట్లోల్లదేవేందర్ రెడ్డి,బోర్లంమజీద్ సదర్ హర్షద్ ఖాన్ ,మజీద్ సెక్రెటరీ సయ్యద్ మంజూర్, ఎక్సుదర్స్ దడిగేహైమద్, మహబూబ్, తాడుకోల్ సొసైటీ మాజీ డైరెక్టర్ వెంకట్ రెడ్డి, కొత్తబాద్ మాజీసర్పంచ్ సాయ గౌడ్, తదితరులు, పాల్గొనడం జరిగింది.

# గ్రూప్ 1 పరీక్షలను విజయవంతంగా పూర్తి చేయాలి

## చరవాణీలు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష హాల్లోకి అనుమతి లేదు
## అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ముందే చూసుకోవాలి
## అభ్యర్థులు ఉదయం 10 గంటలకల్లా పరీక్ష కేంద్రంలోకి చేరుకోవాలి
## సమయపాలనలో ఎలాంటి మినహాయింపు లేదు,
## లేటుగా వచ్చిన అభ్యర్థులను పరీక్ష హాల్లోకి అనుమతి నిరాకరణ
## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

**టైమ్స్ ఆఫ్ వార్త – మెదక్ జిల్లా ప్రతినిధి( బైండ్ల లక్ష్మణ్ )**



ఈ నెల 9న జరిగే గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలు సజావుగా, నిష్పక్షపాతంగా జరిగే లా అంకిత భావంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం మెదక్ జిల్లా మంబోజి పల్లి గ్రామంలో గీతా హై స్కూల్ నందు, మెదక్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన టీజీ పి. ఎస్. పి. గ్రూప్ -01 ప్రిలిమ్స్ టెస్ట్ పరీక్ష కేంద్రాలను సందర్శించారు. పరీక్ష పగడ్బందీగా నిర్వహణపై ఇన్విజిలేటర్స్ కు అవగాహన సదస్సు కార్యక్రమంలో పరీక్షల సమర్ధ నిర్వహణకు కలెక్టర్ తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్ -01 పరీక్షలలో ఎలాంటి పొరపాట్లు జరగకుండ కేటాయించిన విధులను నిబద్ధత తో నిర్వర్తించాలని అన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు కొనసాగే గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లా నుండి గ్రూప్ వన్ ప్రిలిమ్స్ పరీక్షకు హాజరవుతున్న 3,912 మంది అభ్యర్థుల కొరకు 10 కేంద్రాలలో కనీస సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. డిపార్ట్మెంటల్ అధికారులు, పర్యవేక్షకులు, రూట్ ఆఫసిర్లను నియమించినట్లు తెలిపారు. కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉదయం 10 గంటలకల్లా అభ్యర్థులు పరీక్ష హాల్లోకి చేరుకోవాలని సమయపాలనలో ఎలాంటి మినహాయింపు లేదని చెప్పారు బయోమెట్రిక్ హాజరు నమోదు (ఆఫ్ లైన్ ) ద్వారా /ఉదయం 9: 30 గంటలకు మొదలు కాబోతుందని వివరించారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో టీజీపీఎస్సీ గ్రూప్ -1 పరీక్ష పేపర్లు ఓపెన్ చేయాలని చెప్పారు, మొబైల్ ఫోన్స్ ఎలక్ట్రానిక్ ఐటమ్స్ ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని సూచించారు. పరీక్ష పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధిస్తున్నామని, పరీక్షా కేంద్రంలో చీఫ్ సూపర్డెంట్ అబ్జర్వర్, ఇన్విజిలేటర్, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లు,ఆశా ఏఎన్ఎం, సెల్ఫోన్ స్టోరేజ్ స్టాఫ్ తప్ప మరి ఇతర వ్యక్తులు పరీక్ష పరిసర ప్రాంతాల్లో ఉండకూడదని తెలియజేశారు.

**అభ్యర్థులకు సూచనలు :** పరీక్షా సమయానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థుల్ని హాల్లోకి అనుమతిస్తారు. పరీక్షకు అరగంట ముందే గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు కేవలం చెప్పులు ధరించాలి. బూట్లు వేసుకుని రాకూడదన్నారు

**బయోమెట్రిక్ తప్పనిసరి :** పరీక్ష కేంద్రంలో ప్రవేశించిన అభ్యర్థి నుంచి బయోమెట్రిక్ వేలిముద్రలు సేకరిస్తారు. ఒకవేళ బయోమెట్రిక్ ఇవ్వకుంటే సదరు అభ్యర్థి జవాబు పత్రం మూల్యాంకనం చేయబోమని కమిషన్ స్పష్టం చేసిందని వివరించారు బయోమెట్రిక్ పూర్తయ్యేవరకు అభ్యర్థులెవరూ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదని అభ్యర్థుల సౌకర్యార్థం అరగంట కోసారి బెల్ మోగించి పరీక్ష సమయాన్ని తెలియజేస్తారు. అవసరమైతే ఇన్విజిలేటర్లను అడిగి సమయం తెలుసుకోవచ్చున్నారు ఒకవేళ డౌన్లోడ్ చేసిన హాల్ టిక్కెట్లో అస్పష్టమైన ఫోటో ఉన్నట్లయితే, అభ్యర్థి మూడు (3) పాస్పోర్ట్ సైజు ఫోటోలను విధిగా అండర్ టేకింగ్తో పాటు చివరిగా చదువుకున్న విద్యా సంస్థ గెజిటెడ్ అధికారి/ప్రిన్సిపాల్ చేత ధ్రువీకరణతో తీసుకురావాలి (ఫార్మాట్ వెబ్సైట్‌హో(https://www.tspsc.gov.in) లో అందుబాటులో ఉంది). లేకుంటే పరీక్షా కేంద్రంలోకి అనుమతించారని చెప్పారు. అభ్యర్థులు పరీక్ష ముగిసేవరకు పరీక్ష కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు పరీక్ష ముగిసిన తరువాత ఓఎంఆర్ పత్రాన్ని ఇన్విజిలేటర్కు అప్పగించాలని. హాల్ టికెట్ పై ముద్రించిన సూచనల కాపీని కూడా కమిషన్ ఇప్పటికే వెబ్సైట్లో అందుబాటులో ఉంచిందని సూచనలు జాగ్రత్తగా చదివి పరీక్ష సమయంలో వాటిని పాటించాలి. అభ్యర్థులు పొరపాట్లు చేసినా, ఓఎంఆర్, హాల్ టికెట్లలోని నిబంధనలు పాటించకున్నా.. కమిషన్ ఎలాంటి బాధ్యత వహించదని చెప్పారు. ఈ సమావేశంలో టీజిపిఎస్సి అబ్జర్వర్ రోహిత్ కుమార్, రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ కే హుస్సేన్, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సంబంధిత ఇన్విజిలేటర్సు పాల్గొన్నారు.



# ఆలయ అభివృద్ధికి హనుమాన్ భక్తులు విరాళం అందించడం అభినందనీయం...

## పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు చంద్ర రెడ్డి...
## రూ.35,500/- వంట సామగ్రి అందజేత..



**టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి**

కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం అభివృద్ధికి హనుమాన్ దీక్ష బూనిన స్వాములు తమ వంతు విరాళంగా రూ. 35,500/- (ముప్పై ఐదు వేల ఐదు వందలు) లతో వంట సామగ్రి ని అందించడం అభినందనీయమని బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి , ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ని ధర్మారావు అన్నారు . గత 41 రోజులుగా హనుమాన్ దీక్ష చేపట్టిన హనుమాన్ భక్త బృందం స్వాములు జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా దీక్ష విరమణ చేశారు . సుమారు 70 మంది హనుమాన్ భక్తులు నిత్యం పూజలు చేసుకునేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసి సహకరించిన సందర్భంగా ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు స్వాములందరూ కలిసి ఆలయానికి కావలసిన పలు వంట సామాగ్రిని శనివారం ఆలయ కమిటీ, బస్తీ కమిటీ సభ్యులకు అందజేశారు . ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు ప్రతి ఏడు మాల విరమణ అనంతరం ఆలయానికి కావలసిన సామాగ్రిని ఇతర వస్తువులను అందజేస్తూ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు అన్నారు. ప్రతి ఒక్కరికి శ్రీ సీతారామాంజనేయ స్వామి కరుణాకటాక్షాలు సిద్ధిస్తూ అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ గడ్డం రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొడ్ల రాంరెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ , బస్తి ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ , సభ్యులు దశరథ్ , తడకల రాజిరెడ్డి గురు స్వాములు కృష్ణారెడ్డి, మారుజోడు శంకర్, కుల్ల రాజు, మినుముల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ చారి, ఎల్లకొండ జయకుమార్ గుప్త, మహేందర్, జగన్ మోహన్ రావ్, అజేయ్, శ్రీకాంత్, హరి, పుష్కన్ రెడ్డి, యాదగిరి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు...

# కీర్తిశేషులు రామోజీరావుకి కూకట్‌పల్లి పాత్రికేయుల ఆధ్వర్యంలో ఘన నివాళి

## తెలుగు పత్రికా రంగం ఉన్నంత వరకు మీ పేరు కీర్తింపబడుతుంది
## జర్నలిస్టులకు ఆయన ఆదర్శంగా నిలిచిన వ్యక్తి..



**టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి**

ఈనాడు సంస్థల ఛైర్మన్ కీర్తిశేషులు రామోజీరావుకి కూకట్ పల్లి పాత్రికేయుల ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. వార్త పత్రికలు, మీడియా ఛానల్ల రంగంలో తెలుగు మీడియా మొఘల్ గా కీర్తింపబడి, ప్రసిద్ధి చెందిన రామోజీరావు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమన్నారు. మీడియా రంగంలో దశాబ్దాలుగా ఎంతోమంది జర్నలిస్టులకు ఆయన ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించిన దాసరి రాహుల్ ప్రదీప్, గింజుపల్లి వేణు, తెల్ల హరికృష్ణ, సిహెచ్ క్రాంతి కుమార్, రిషి రాజు, మారుతి సాగర్, అనిల్, సత్య, శ్రీధర్ తదితరులు పాల్గొని రామోజీరావు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు.

# రామోజీరావుకు ఘన నివాళులర్పించిన పిసిసి కొ ఆప్షన్ సభ్యులు గాలి బాలాజీ

## రామోజీరావు కీర్తి కి మరణం లేదు : గాలి బాలాజీ

**టైమ్స్ ఆఫ్ వార్త – కూకట్ పల్లి**



ఈనాడు గ్రూప్స్ అధినేత పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు స్వర్గస్తులైన సందర్భంగా కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ తరపున కె పి హెచ్ బి టెంపుల్ బస్టాండ్ వద్ద ఘన నివాళులు అర్పించటం జరిగింది. ఈ కార్యక్రమంలో కె పి హెచ్ బి డివిజన్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అరవిందరెడ్డి, కె. రామారావు,ముఖ్ధూమ్, రాజేష్ గౌడ్, అట్లూరి దీపక్, సంధ్య రాణి, పిడికిటి గోపాల్ చౌదరి, సాయి, నవీన్, బాలు లు పాల్గున్నారు. పారిశ్రామిక దిగ్గజం అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించి లక్షలాది మందికి పరోక్షంగా గానీ ప్రత్యక్షం గానీ ఉపాధి కల్పించిన దార్శనికుడు రామోజీరావు, ఆయన కీర్తి కి మరణం లేదని టి పి సి సి సెక్రటరీ, పి సి సి కొ ఆప్షన్ సభ్యులు గాలి బాలాజీ కొనియాడటం జరిగింది

# ఎన్టిఏ వైఫల్యం కారణంగా నష్టపోయిన విద్యార్థులందరికీ న్యాయం చేయాలి

**టైమ్స్ ఆఫ్ వార్త – నిజామాబాద్ సిటీ**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్షను రద్దుచేసి, తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నిజామాబాద్ నగర అధ్యక్షుడు గణేష్ మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన నీట్ పరీక్ష ఫలితాలను విడుదల చేయడం జరిగిందని, అయితే ఈ పరీక్షల్లో దేశవ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు ఆల్ ఇండియా స్థాయిలో టాప్ ర్యాంకు సాధించారని, అయితే ఈ పరీక్షల ఫలితాలను జూన్ 14వ తేదీన విడుదల చేస్తామని చెప్పి, ఎలక్షన్ ఫలితాల రోజునే విడుదల చెయ్యటంలో ఆంతర్యం ఏమిటో, ఎవరి ప్రయోజనాల కోసం ఈ పరీక్షను నిర్వహించారు అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అలాగే 2021, 2022, 2023 సంవత్సరాలలో నిర్వహించిన నీట్ పరీక్షల్లో ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థులకు మాత్రమే మొదటి ర్యాంకు వచ్చిన పరిస్థితి ఉందన్నారు. అయితే 2024 లో నిర్వహించిన నీట్ పరీక్షల్లో 67 మందికి మొదటి ర్యాంకు ఏ విధంగా వస్తుందని ప్రశ్నించారు. అదేవిధంగా ఒకే పరీక్ష కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు మొదటి ర్యాంకు రావడం చూస్తుంటే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు సరైన సమయంలోనే పరీక్ష కేంద్రానికి చేరుకున్నప్పటికీ విద్యార్థులకు ప్రశ్నాపత్రాలు ఇవ్వడంలో మాత్రం 20 నిమిషాలకు పైగా ఆలస్యం చేసి, ఆలస్యం అయిన 20 నిమిషాల కొరకు 40 గ్రేస్ మార్కులుగా కలిపి, కష్టపడి చదివిన విద్యార్థులకు అన్యాయం చేస్తూ ఎన్ టి ఏ వ్యవహరించిన తీరు సరికాదని అన్నారు. అదేవిధంగా ఇలా ఎన్ టి ఏ నిర్వహించిన నీట్




పరీక్షల్లో కొంతమంది ప్రయోజనాల కొరకు అనేకమంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతుందని,దీని కారణంగా కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు కూడా చేసుకున్న సంఘటనలు జరిగినా ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ వారు స్పందించి ఈ సంవత్సరం ఎన్ టీ ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జిజే విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు వేణు,సంతోష్,నాయకులు రాజు, మారుతి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



జనరల్ న్యూస్
GENERAL NEWS
టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక
ఆదివారం,
09-06-2023
3

# ఎస్సీ టీఎస్ స్టడీ సర్కిల్ అక్రమాలపై విచారణ చేపట్టాలి

## పి.డి.ఎస్.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ డిమాండ్




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామబాద్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్ లో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఎన్.ఆర్.భవన్ కోటగల్లి ఆఫీసులో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీ.డీ.ఎస్.యు. నిజామబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.., తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ఎస్సీ విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా డీఎస్సీ కోచింగ్ ఎస్సి టిఎస్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కానీ ఎస్సీ స్టడీ సర్కిల్ జిల్లా అధికారి అయిన డీఎస్సీడీవో శశికళ మరియు ఇన్చార్జి ఎస్. మారుతి, హెచ్.డబ్ల్యు నిర్వాహకన మూలంగా స్టడీ సర్కిల్ విద్యార్థులు చాలా అవస్థలు పడుతున్నారన్నారు. ఒక్కో విద్యార్థికి 75 రూపాయల చెప్పుకున్న నాణ్యమైన భోజనం కొరకు రాష్ట్ర ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. కానీ డీఎస్సీడీవో, మారుతి వాళ్ళ కక్కుర్తి వల్ల నాణ్యత లేని భోజనాన్ని పెడుతున్నారన్నారు. దాదాపు డీఎస్సీ షార్ట్ టర్మ్ కోచింగ్ కొరకు 40 మంది విద్యార్థులు మాత్రమే వస్తే 100 మంది వస్తున్నారని, భోజన, బుక్స్ మెటీరియల్ సంబంధించిన వాటిలో అక్రమాలు జరిగాయన్నారు. మౌలిక సదుపాయాలు, నాణ్యమైన భోజనాన్ని అందించాలని విద్యార్థులు కోరగా డీఎస్సీడీవో, ఎస్. మారుతి హెచ్డబ్ల్యూ విద్యార్థుల పైకి దురుసుగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలోని ఎస్సీ వసతి గృహాల నాలుగో తరగతి సిబ్బందిని స్టడీ సర్కిల్ లో విధులను కేటాయిస్తూ, వారికి బదులు బినామీ పేర్ల మీద జీతాలు నొక్కేస్తున్నారన్నారు. నియమ నిబంధనలు పాటించకుండా విద్యార్థుల వసతి కోసం స్టడీ సర్కిల్ దూరంగా ఏర్పాటు చేసి, అద్దెకు సంబంధించిన యజమాని పేరు మీద కాకుండా ఇన్చార్జి ఎస్. మారుతి, హెచ్డబ్ల్యూ పేరు పైన డబ్బులు డ్రా చేయడం దారునమన్నారు. 40 మంది విద్యార్థులకు గాను 100 మంది విద్యార్థులకు బుక్స్ కొనుగోలు చేశారని వారికి ఇచ్చినట్లు అక్విటెన్స్ సృష్టించి బిల్లులు క్లెయిమ్ చేశారన్నారని ఆరోపించారు. ఇటువంటి అక్రమాలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. వెంటనే జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టి నిధులు రికవరీ చేసి డీఎస్సీడీవో శశికళ, ఎస్.మారుతి, హెచ్డబ్ల్యూ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే అశుర్, జిల్లా నాయకులు మహిపాల్, సందీప్, సృజన్, శివ తదితరులు పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా తొలగించడం అన్యాయం




టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

సర్వ శిక్ష అభియాన్ లో వివిధ విభాగాలలో పనిచేస్తున్న 61 ఏళ్లు నిండిన వారిని వారికి చెందాల్సిన బెనిఫిట్స్ను ఇవ్వకుండా తొలగించడం అన్యాయం అని ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ (ఐ.ఎఫ్.టీ.యు) ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోనీ ఎన్.ఆర్ భవన్, కోటగల్లిలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఐ.ఎఫ్.టీ.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సుధాకర్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్.ఎస్.ఏ) వివిధ విభాగాల్లో పనిచేస్తూ 61వ సంవత్సరాల వయసు నిండిన వారిని తొలగిస్తామని ఎస్.పీ.డీ మల్లయ్య భట్టు ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ముఖ్యంగా కేజీబీవీలో నాన్ టీచింగ్, వర్కర్లు పదహారేళ్లకు పైగా వెట్టిచాకిరి చేశారన్నారు. వీరికి కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు లేవన్నారు. ఇప్పుడు హఠాత్తుగా తొలగిస్తే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. తొలగింపు నిర్ణయాన్ని సంవత్సరకాలం పాటు వాయిదా వేయాలన్నారు. ప్రభుత్వం అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ ఇస్తుందన్నారు. ఎస్.ఎస్.ఏ, కేజీబీవీ నాన్ టీచింగ్ సిబ్బందికి 2 లక్షల రూపాయలు, వర్కర్లకు 1లక్ష రూపాయలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా రిటైర్మెంట్ అయిన వారి కుటుంబంలో ఒకరికి ఆ ఉద్యోగాన్ని కేటాయించాలన్నారు.తొలగింపు నిర్ణయాన్ని హడావిడిగా అమలు చేయాలని చూస్తే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యు జిల్లా అధ్యక్షుడు ఎం. ముత్తెన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. వెంకన్న, జిల్లా సహాయ కార్యదర్శి ఆర్. రమేష్ జిల్లా నాయకులు డి. కిషన్, బి. మురళి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ లో 6 కోట్ల భూనష్ట పరిహారం కేసు రాజీ



టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ అదనపు జిల్లా కోర్టులో న్యాయ విచారణలో ఉన్న భూనష్ట పరిహారం సివిల్ దావా ఇరుపక్షాల రాజీ మేరకు పరిష్కరిస్తు 6 కోట్ల 11 లక్షల 15 వేల 111 రూపాయలకు గాను జాతీయ లోక్ అదాలత్ శనివారం అవార్డును జారీ చేసింది. దీనికి సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నిజామాబాద్ నగరానికి చెందిన నారాయణ రావుకు చెందిన ఏడు ఎకరాల వ్యవసాయ భూమిని బలహీన వర్గాలకు ఇంటి నిర్మాణం కోసం 1984 లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్ తరపున నిజామాబాద్ రెవిన్యూ డివిజనల్ అధికారి గజిట్ ను విడుదల చేశారు. భూయజమాని అయిన నారాయణ రావు భూనష్ట పరిహారం చెల్లించాలని నిజామాబాద్ అదనపు జిల్లా కోర్టులో 2008లో పది కోట్లకు దావా దాఖలు చేశారు. ఇరు పక్షాలతో సంప్రదింపులు జరిపిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల, నిజామాబాద్ అదనపు జిల్లా జడ్జి కనక దుర్గ ఒక రాజీ పరిష్కారంగా మొత్తం 6 కోట్ల 11 లక్షల 12 వేల 111 వందల రూపాయలకు ఒప్పించారు. ఈ మేరకు లోక్ అదాలత్ లో అవార్డు అందజేసి బ్యాంకు చెక్ ను భూ నష్ట పరిహారదారు నారాయణ రావుకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ చైర్ పర్సన్ సునీత కుంచాల, అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్ కుమార్ తో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి పద్మావతి, ప్రభుత్వ న్యాయవాది శ్రీహరి ఆచార్య, సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తమ గౌడ్ పాల్గొన్నారు.

# బోధన్ పట్టణంలో కత్తి పోట్ల కలకలం



టైమ్స్ ఆఫ్ వార్త-బోధన్

బోధన్ పట్టణంలో కత్తి పోట్ల కలకలం రేపింది. శనివారం పట్టణంలోని పాత బస్ స్టాండ్ ప్రాంతంలో గల కల్లుబట్టిలో ఇరువురి వ్యక్తుల మధ్య రాజుకున్న గొడవ కత్తి పోట్లకు దారి తీసింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్ ప్రాంతంలో గల కల్లు బట్టిలో కల్లు తాగుతున్న క్రమంలో గంగాధర్, జీవన్ సింగ్ ల మధ్య వివాదం రాజుకుంది. ఇరువురి మధ్య మాట మాట పెరగడంతో గంగాధర్ మెడపై జీవన్ సింగ్ కత్తితో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం అవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించి బాధితుడైన గంగాధర్ ను వెంటనే పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి జీవన్ సింగ్ ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు.

# పెండింగ్లో బిల్లులు వెంటనే మంజూరు చేయాలి

## ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన మధ్యాహ్న భోజన కార్మికులు



టైమ్స్ ఆఫ్ వార్తు బాన్సువాడ:

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి కామారెడ్డి జిల్లా కమిటీ సమావేశము బాన్సువాడలో శనివారం ఏఐటీయూసీ ఆఫీసులో జరిగినది. ఈ సందర్భంగా ఏఐటిసి నాయకులు తోపునూరు చక్రపాణి,దుబాస్ రాములు లు మాట్లాడుతూ ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వము పెండింగ్లో బుల్లులు బిల్లులు సుమారు 8 కోట్ల రూపాయలు బకాయి ఉన్నవి గత ప్రభుత్వాలు మాదిరిగానే ఈ ప్రభుత్వం కూడా మధ్యాహ్న భోజన కార్మికులను మానసికంగా ఆర్థికంగా ఇబ్బంది పెడతా ఉన్నారు. ఇది సరి అయింది కాదు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వము ఎనిమిది కోట్ల పెండింగ్లో ఉన్న బిల్లుని మంజూరు చేయాలని,ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని,10,000 కార్మికుడికి ఇవ్వాలని,మౌలిక సదుపాయాల కింద ప్రతి పాఠశాలలను అన్ని సమకూర్చాలని,నిత్యవసర వస్తువులు గ్యాస్ తో సహా సరఫరా చేయాలని చెప్పి ఈ సందర్భంగా తీర్మానించినది. ఈ సమస్యను పరిష్కరించకుంటే ఈ నెల 11వ తేదీ నాడు ఆర్డిఓ ఆఫీస్ ల ముందు ధర్నా నిర్వహించాలని నిర్ణయం చేశారు.కామారెడ్డి,ఎల్లారెడ్డి, బాన్సువాడలో ధర్నా నిర్వహిస్తా ము అని తెలిపారు. ఒకవేళ సమస్యను పరిష్కరించకుంటే అదేరోజు సమ్మె నోటీస్ ఇచ్చి మొత్తం మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపివేస్తామని చెప్పి ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అని తెలిపారు.ఈ సమావేశంలో బాన్సువాడ ఎల్లారెడ్డి నాగిరెడ్డిపేట పిట్లం నిజాంసాగర్ కోడప్పుగల్ బీర్కూరు,నర్సుల్లాబాదు మధ్యాహ్న భోజన బాధ్యులు పాల్గొన్నారు మల్లవ్వ అధ్యక్షత వహించినది.ఈ సమావేశంలో దుబాస్ రాములు,రాష్ట్ర ఉపాధ్యక్షుడు అధ్యక్షులు,తోపునూరు చక్రపాణి మాట్లాడుతూ సమావేశాన్ని జిల్లా కమిటీ తీర్మానించిన అందరం కలిసి కృషి చేసి విజయవంతం చేస్తామని తెలియజేయడం జరిగినది.

# నీట్ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం



టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

నీట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులు సాధించిన 5 గురు విద్యార్థులు తబస్సుమ్, తుబ, వహీర, సకిన, కార్తిక్ లను మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు అక్బర్ శనివారం ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి సీటు పొందడం గొప్ప విషయమని ఆయన కొనియాడారు.. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఖలీల్, ఖాజా మెయిన్, ఏజస్, జాయిమ్, అక్రమ్, ఈనాం, సమీర్, ఖమర్ తోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యాభిమానులు, తదితరులు, పాల్గొన్నారు .

# రామోజీరావుకు ఘనంగా నివాళులు అర్పించిన బాన్సువాడ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు



టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

ఈనాడు జాతీయ దినపత్రిక, రామోజీ గ్రూప్ అధినేత,నిత్య సత్య అక్షర యోధుడు, పద్మ విభూషణ్ గ్రహీత, తెలుగువారి మేలుకొలుపు, తెలుగు అక్షరానికి మార్గదర్శకుడు రామోజీరావుకు శనివారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఆవరణలో బాన్సువాడ ప్రెస్ క్లబ్ ప్రతినిధులు ఘనంగా నివాళులు అర్పించారు.ఆయన చిత్రపటానికి పూలమాలవేసి, మౌనం పాటించి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, స్వర్గలోక ప్రాప్తిరస్తు కావాలని మనసారా ఆకాంక్షించారు.అనంతరం ఆయన పత్రికా రంగం అభివృద్ధికి చేసిన సేవలు గురించి కొనియాడారు. ఆయన మరణం పత్రిక రంగానకి ,సినీ రంగానికి,ఎంతో తీరని లోటని తెలిపారు.రామోజీరావు కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని,సంతాపాన్ని, వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గంటా చందు తో పాటు సీనియర్ పాత్రికేయులు మోహిన్,కల్లేటి వెంకటరమణ,మా రూ శెట్టి హనుమాన్లు, డాంగే గంగాధర్,గుం డోబా శ్రీనివాస్ తోపాటు పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి



టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

బాన్సువాడ మండలంలోని కోనాపూర్ -హనుమాజీపేట్ వద్ద 12 కోట్లతో నూతనంగా నిర్మించే ప్రభుత్వ గిరిజన బాలికల గురుకుల పాఠశాల భవన నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దుద్దాల అంజిరెడ్డి తో పాటు ఎంపీటీసీలు సుధాకర్ రెడ్డి ,జెట్టి హనుమాన్లు, రాజేశ్వర్ గౌడ్ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు ,పాల్గొన్నారు.

# ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామారావు ఆధ్వర్యంలో రామోజీరావుకు ఘన నివాళులు



టైమ్స్ ఆఫ్ వార్త - కూకట్ పల్లి

ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీరావు (88) కి ఆకాంక్ష ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామారావు ఆధ్వర్యంలో కూకట్పల్లి వివేకానంద నగర్ ప్రాంతంలోని వివేకానంద విగ్రహం ముందు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆకాంక్ష ఫౌండేషన్ చైర్మన్ రామారావు, సీనియర్ జర్నలిస్ట్ ఎర్ర యాకన్న, కూకట్పల్లి స్థానికులు నరసింహ, ప్రేమ్ కుమార్, సురేష్, మని, భూమయ్య, భాషా, రమేష్, విలేకరులు అనిల్ కుమార్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు...



జనరల్ న్యూస్
GENERAL NEWS

టైమ్స్ ఆఫ్ వార్త
తెలుగు దినపత్రిక

ఆదివారం,
09-06-2023

4


# కార్మికులకు లాభాల వాటా 35 శాతం ప్రకటించాలి

**ఐఎన్టియుసి సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్**

**సింగరేణి సిఎండి బలరాం కు వినతిపత్రం**

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల నుండి కార్మికులకు 35 శాతం లాభాల వాటా ప్రకటించాలని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ) సెక్రటరీ జనరల్ బి జనక్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లోని సింగరేణి భవన్లో సింగరేణి సిఎండి బలరాం నాయక్, ఐఆర్ఎస్ ను కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనక్ ప్రసాద్ మాట్లాడుతూ, 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసి రెండు నెలలు కావస్తున్నా ఎన్నికల కోడ్ మూలాన ఇప్పటివరకు ప్రకటించని లాభాల వాటాను కోడ్ ముగిసిన నేపథ్యంలో వెంటనే ప్రకటించాలని కోరారు. సింగరేణికి 2022- 23 ఆర్థిక సంవత్సరంలో 67.13 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేస్తే, 33 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరిగి, సింగరేణికి 2222 కోట్ల రూపాయల లాభాలు వచ్చాయని, దానిలో నుండి 32 శాతం లాభాల వాటా గా 711.18 కోట్ల రూపాయలు కార్మికులు చెల్లించారని గుర్తు చేశారు. కొత్తగా సీఎండీగా బాధ్యతలు చేపట్టిన బలరాం నాయక్ ఈ ఆర్థిక సంవత్సరానికి గాను కార్మికులు కష్టపడి రికార్డు స్థాయిలో 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయగా , 37 వేల కోట్ల వ్యాపారం జరిగిందన్నారు. దీనికి రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం సహకారం సైతం ఉందని తెలిపారు. గతంతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరానికి రికార్డ్ స్థాయిలో ఉత్పత్తి సాధించిన కార్మికుల కోసం ఈ సారి లాభాల వాటా 35 శాతం ప్రకటించాలన్నారు. గతంలో సింగరేణికి వచ్చిన లాభాల నుండి కార్మికులకు 2014-15లో 21 శాతం, 2015-16లో 23 శాతం, 2016-17లో 25 శాతం,2017-18లో 27 శాతం,2018-19లో 28 శాతం, 2019-20లో 28 శాతం, 2020-21లో 29 శాతం, 2021-22లో 30 శాతం,2022-23లో 32 శాతం లాభాల వాటా చెల్లించారని వివరించారు

## హెచ్ రవీందర్ పరామర్శించిన ప్రొఫెసర్ కోదండరాం



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

మాతృ వియోగంతో బాధపడుతున్న తెలంగాణ వికాస సమితి రాష్ట్ర నాయకులు, సీనియర్ పాత్రికేయులు హెచ్ రవీందర్ ను శనివారం పట్టణంలోని ఆయన నివాసంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం పరామర్శించారు. ముందుగా హెచ్ రవీందర్ మాతృమూర్తి ఈశ్వరమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించి, రవీందర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా రవీందర్ స్వయంగా రచించి, విడుదల చేసిన అమ్మ నాన్న యాదిలో సముద్రమంత మనుషులు పుస్తకాన్ని కోదండరామ్ కు అందజేశారు. ఈకార్యక్రమంలో హెచ్ రవీందర్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ ప్రమాణ స్వీకారానికి జిల్లా నాయకులకు ఆహ్వానం





టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారోత్సవానికి చెందిన నాయకులకు ఆహ్వానం అందింది. ఇందులో భాగంగా భారతీయ జనతా పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు,ప్రస్తుత మెదక్ జిల్లా పార్లమెంట్ ప్రబారి బస్వాపురం లక్ష్మీ నర సయ్య,జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు,జహీరాబాద్ పార్ల మెంట్ ప్రబారి పెద్దల గంగారెడ్డి కి భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది.వీరు నేడు ఢిల్లీలో జరిగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రమాణ స్వీకారం లో పాల్గొననున్నారు.

## బాన్సువాడ లో లోక్ అదాలత్ లో 26 7 కేసులకు పరిష్కారం



టైమ్స్ ఆఫ్ వార్తు బాన్సువాడ:

బాన్సువాడ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా కోర్టు జడ్జి టిఎస్పి భార్గవి 267 కేసులను పరిష్కరించారు. ప్రజలు లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జడ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణమూర్తి, న్యాయవాదులు రామిరెడ్డి, ఖలీల్, కోర్టు సిబ్బంది, సంబంధిత అధికారులు, ప్రజలు ,తదితరులు, పాల్గొన్నారు

## ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



టైమ్స్ ఆఫ్ వార్తు- బాన్సువాడ:

లోక సృష్టికర్త, పరమ పితామహుడు, శివుని జన్మ నక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీ సోమలింగేశ్వర ఆలయంలో మల్లారం లింగేశ్వర ఆశ్రమ పీఠాధిపతులు, తపస్వి, బాలయోగి,, శ్రీశ్రీశ్రీ పిట్ల కృష్ణ మహారాజ్ కరకములచే ప్రత్యేకంగా జలాభిషేకం, పంచామృత అభిషేకం తో పాటు ప్రత్యేకంగా అలంకరించి, పూజా కార్యక్రమాలు చేపట్టారు. బాన్సువాడ పట్టణానికి చెందిన వాట్ వాట్ ప్రియంక బాలరాజు దంపతుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం స్వామీజీ భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. స్వామీజీకి పాదపూజ చేపట్టి, పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి, హారతులు, ఇచ్చారు. స్వామీజీ భక్తులకు అభిషేక విభూతిని పెట్టి ఆశీర్వదించారు. అనంతరం శ్రీ హనుమాన్ దీక్ష సేవా సమితి బాన్సువాడ వారి ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటుచేసిన అల్పాహార ప్రసాదాన్ని భక్తులు స్వీకరించారు. తీర్థ, ప్రసాద నైవేద్య లు, భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు బంగారు మైసయ్య, అంబిలిపూర్ రాజు, పల్లికొండ నరేందర్ గుప్తా, కట్టాల సంపత్ గౌడ్, చీకట్ల వెంకట్, గణేష్ తో పాటు మహిళలు, భక్తులు, తదితరులు ,పాల్గొన్నారు.

## రామోజీరావుకు ఘన నివాళులు



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

కమ్మ సేవా సమితి మంచిర్యాల, కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలోని కమ్మ సేవా సమితి కార్యాలయంలో శనివారం ఈనాడు సంస్థల అధిపతి, దివంగత చెరుకూరి రామోజీరావు కు ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా రామోజీరావు చిత్రపటానికి పూలమాలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సేవాసమితి గౌరవ అధ్యక్షుడు కొల్లి విష్ణువర్ధన్ రావు, అధ్యక్షుడు వడ్డే వినయ్ కుమార్ లు మాట్లాడుతూ, పత్రిక రంగం, ఎలక్ట్రానిక్ మీడియా రంగం, చలనచిత్ర రంగం, ఆర్థిక రంగాలలో ఎంతో మందికి అవకాశాలు కల్పించిన మహెూన్నత వ్యక్తి రామోజీరావు అని, దేశంలో ఎడిటర్స్ గిల్డ్ చైర్మన్ గా వ్యవహరించి, పద్మభూషణ్ బిరుదు గ్రహించిన మహనీయుడిని కొనియాడారు. రామోజీ ఫిలిం సిటీని స్థాపించి, తెలుగు సినీ రంగంలో అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించి పెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రధాన కార్యదర్శి గంగవరపు వెంకటేశ్వర్లు, కోశాధికారి వెనిగళ్ళ శ్రీనివాసరావు, ప్రధాన సమన్వయకర్త బోతనపల్లి కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శులు మేడసాని చెన్నకేశవులు, గొడవర్తి సుధీర్, సభ్యులు సబ్బినేని సుబ్బారావు, వాసిరెడ్డి రాజేంద్రప్రసాద్, కేతినేని రవీంద్రబాబు, నూతక్కి సూర్య కుమార్, వేమసాని వెంకటేశ్వరరావు, గంగవరపు హరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు కరువైన కనీస వసతులు

టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-



సింగరేణి ఏరియాలోని కాసీపేట 2గనిలో కార్మికులు కనీస వసతులు కరువై,తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి) కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, కేంద్ర కమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాంశెట్టి నరేందర్ లు ఆరోపించారు. యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య ఆధ్వర్యంలో బాయి బాట కార్యక్రమంలో భాగంగా శనివారం ఏరియాలోని కాసీపేట-2 గనిని సంద ర్శించి,కార్మికుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం కాంపెల్లి సమ్మయ్య, రాంశెట్టి నరేందర్ లు మాట్లాడుతూ, గని మీద షెడ్లు లేక లక్షల రూపాయలు విలువ చేసే సామాగ్రి, ఎండకు ఎండి, వానకు తడిచి, తుప్పు పడుతూ, పనికిరాకుండా పోతున్నాయని ఆరోపించారు. కనీసం వెల్డర్ పని చేసే ప్రదేశంలో సైతం సరైన షెడ్డు లేక పనిచేసే కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టబ్ సెక్షన్ షెడ్ పెద్దదిగా లేకపోవడంతో కార్మికులు ఎండలో, వానలో పనులు చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా గని లోపల అండర్ గ్రౌండ్ లో పనిచేసి, ఉపరితలం పైకి వచ్చే సమయంలో మార్గమధ్యంలో ఒక్కచోట ఎక్కడ త్రాగునీటి వసతి లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గనిపై కార్మికుల సౌకర్యార్థం బాత్రూంలు సైతం సరిగ్గా లేవని, దీంతో కార్మికులు బయటికి పోయే పరిస్థితి గని పై నెలకొందని ఆరోపించారు. కార్మికుల సౌకర్యార్థం త్వరగా మ్యాన్ రైడింగ్ ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమస్యలన్నింటిపై గని మేనేజర్, ఏరియా యాజమాన్యంతో చర్చించి, అతి త్వరలో సమస్యలు పరిష్కరించే చొరవ తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి దొరిశెట్టి చంద్రశేఖర్, సహాయక కార్యదర్శి కారుకూరి తిరుపతి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, యూనియన్ నాయకులు జివి ప్రదీప్, గాలి పరమేశ్వర్, తొంగల కుమార్, చింతం రవికిరణ్, సమ్మిరెడ్డి, శంకర్, సంగ రాజేష్, సత్తన్న తదితరులు పాల్గొన్నారు.

# రామోజీరావు సేవలు గుణాత్మకం



**వర్ధన్నపేట జర్నలిస్టులు**

టైమ్స్ఆఫ్ వార్త-వర్ధన్నపేట:



తెలుగు రాష్ట్రాల మీడియా శిఖరం తుదిశ్వాస విడిచి నేలకొరిగిన వేళ జర్నలిస్టులోకం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. రామోజీరావు మీడియా రంగంలో చేసిన సేవలను కొనియాడుతూ వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో జర్నలిస్టులు కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన రామోజీరావు సేవలు గుణాత్మకమైనవని జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ప్రజలకు ప్రభుత్వాలకు మధ్య వారదిగా ఉండి, ఎనలేని సేవలందించిన ఈనాడు, ఈటీవి సంస్థల అధినేత రామోజీరావు మరణం కలచివేసిందని వారన్నారు. మీడియా రంగంలో ఆయన చేసిన సేవలను స్మరిస్తూ ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వర్ధన్నపేట జర్నలిస్టులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మచ్చ సమ్మయ్య, రామ్ (సేటు), తాళ్ళపెల్లి రమేష్, హైమద్, రఘుమాదవ్, మంచోజు సత్యనారాయణ, వడ్లకొండ రవీందర్, ఐత ప్రవీణ్, రాజు, సతీష్, జయకృష్ణ, సుమన్, హరీష్, రాజేష్, శివ, భాస్కర్, నాగరాజు, వేణు తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ కిడ్స్ పాఠశాల పై చర్యలు తీసుకోవాలి



టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:-

జిల్లా కేంద్రమైన మంచిర్యాల పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్మార్ట్ కిడ్స్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా, కమర్షియల్ భవంతిలో పాఠశాల యాజమాన్యం విద్యాబోధన చేస్తుందని ఆరోపించారు. పాఠశాలలో విద్యార్థులు ఆడుకునేందుకు ఆటస్థలం లేదని, సెట్బ్యాక్ లేదని, ఫైర్ సేఫ్టీ లేకుండా ఇష్టానుసారంగా పాఠశాలను నడిపిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పాఠశాలపై తక్షణమే చర్యలు చేసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఐక్య విద్యా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర కార్యదర్శి చిప్పకుర్తి శ్రీనివాస్, నేతకాని స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిడి గోపాల్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే సల్మాన్, నేషనల్ లిస్ట్ స్టూడెంట్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పురెల్ల నితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

పట్టణంలోని సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ సంజయ్ లు తెలిపారు. పట్టణంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో బాలింతలకు బేబీ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పట్టణ ఎస్ఐ ఎస్ రాజశేఖర్ హాజరై సిఎస్ఐ చర్చి సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ సంజయ్ లు మాట్లాడుతూ, సిఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండడం సంతోషకరమని తెలిపారు. అనంతరం బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వలన కలిగే లాభాలు గురించి వివరించడంతో పాటు తీసుకోకపోవడం వలన కలిగే అనర్థాల పై అవగాహన కల్పించారు. అదేవిధంగా చిన్నారులకు, మహిళలకు చేతులు శుభ్రపరచుకునే విధానం గురించి వివరించడంతోపాటు, సబ్బు తో చేతులు శుభ్ర పరుచుకోవడం కలిగే లాభాల పై సైతం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ రెవ జేర్నియా, సూపర్వైజర్ కే సురేష్, అకౌంటెంట్ మోహన్, సభ్యులు రాజారత్నం, రాజశేఖర్, సునీల్, పద్మారావు, నవీన్, వినోద్, చరణ్, కమల్, సాయ్యేల్ తదితరులు పాల్గొన్నారు.





## రామోజీరావు లేని లోటు తీర్చలేనిది



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

ఈనాడు, ఈటీవీ మీడియా సామ్రాజ్యాధినేత, భారతీయ సినిమా దిగ్గజం అయినటువంటి రామోజీరావు లేని లోటు ఎప్పటికీ తీర్చలేనిది మంచిర్యాల జిల్లా నృత్య కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సునార్కర్ రాంబాబు తెలిపారు.రామోజీరావు అకాల మరణానికి సంతాపం తెలుపుతూ శనివారం పట్టణంలో సంఘం ఆధ్వర్యంలో రామోజీ రావు చిత్రపటానికి పూలమాలు వేసి,ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ,భారతీయ మీడియా,చలనచిత్ర,టెలివిజన్ పరిశ్రమకు రామోజీరావు చేసిన సేవలు చరిత్రపుటలో సువర్ణ అక్షరాలతో లిఖించ బడతాయన్నారు. ఎన్నో ఏళ్ల నుండి ఇప్పటివరకు ఈటీవీలో ధమ్ రిధమ్, ఢీ వంటి డాన్స్ షోలు,జబర్దస్త్ వంటి కామెడీ షోలు నిర్వహించి,ఎంతో మంది గ్రామీణ,పట్టణ కళాకారులకు వేదికనిచ్చిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని కొనియాడారు.ఆ మహనీయుడి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఎల్ మోహిని, సభ్యులు వనిత, ఇప్ప వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1 పరీక్ష నేపథ్యంలో పరిధిలో 144 సెక్షన్ విధింపు

బెల్లంపల్లి ఏసిపి రవికుమార్



టైమ్స్ ఆఫ్ వార్త, మందమర్రి:-

మందమర్రి సర్కిల్ పరిధిలో ఆదివారం గ్రూప్ 1 పరీక్ష జరుగుతున్న నేపథ్యంలో సర్కిల్ పరిధిలో 144 సిఆర్పిసి సెక్షన్ అమల్లో ఉంటుందని బెల్లంపల్లి ఏసిపి ఏ రవికుమార్ తెలిపారు.పరీక్షల బందోబస్తు హాజరయ్యే పోలీసులకు శనివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఆవ రణంలో ఏర్పాటు చేసిన బ్రీఫింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,మంద మర్రి సర్కిల్ పరిధిలో ఐదు పరీక్ష కేంద్రాలలో విధులు నిర్వహించబోయే పోలీస్ సిబ్బంది సమర్థ వంతంగా తమ విధులు నిర్వహించాలన్నారు.పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎల క్ట్రానిక్ వస్తువులు,మొబైల్ ఫోన్లు అనుమతి లేదని,పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతనే లోపలికి పంపించాలని సూచించారు.144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో పరీక్ష కేంద్రాల దగ్గర్లోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని,నలుగురికి మించి జనాలు ఒకే చోట గుమ్మి కూడా రాదని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐకే శశిధర్ రెడ్డి,పట్టణ ఎస్ఐ రాజశేఖర్,సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రోటరీ క్లబ్ 71వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



టైమ్స్ అఫ్ వార్త - నిజామాబాద్ సిటీ

రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 71 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఘనంగా నిర్వహించారు. 72వ ఏటా అడిగిడుతున్న సందర్భంగా మీ సహకారానికి, తోడ్పాటుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక బర్కత్పురా లో గల రోటరీ నిజామాబాద్ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆవిర్భవించి నేటికీ సరిగా 71 వసంతాలు పూర్తిచేసుకుని 72వ ఏటా అడిగిడుతున్న సందర్భంగా సభ్యులందరూ కలిసి కేక్ కట్ చేసి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులైన ఇందూరి శ్రీనివాస్, భరత్ పటేల్, రాజ్కుమార్ సుబేదార్, దర్శన్ సింగ్ సోఖీ, రావులపల్లి జగదీశ్వర రావు, కట్కం శ్రీనివాస్, జ్ఞాన ప్రకాష్, చిలక ప్రకాష్, శ్రీరామ్ సోనీ, బీరేల్లి విజయరావ్, పార్సిరాజేశ్వర్, ధన్పాల్ శ్రీనివాస్, జుగల్ జాజు, శ్యామ్ ఆగర్వాల్, గోపాల్ సోని, వైవి రామ్మోహన్రావు, సుధీర్ గుప్తా, ఆకుల అశోక్, రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## రామోజీ రావు మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపిన మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ



మీడియా, సమాచార రంగంలో విలువలతో కూడిన నూతన ఒరవడులకు, ఎన్నో సంస్కరణలకు శ్రీకారం చుట్టిన మహనీయుడు రామోజీరావు ఇక లేరని బిజేపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నిబద్ధత, క్రమశిక్షణ, పట్టుదలతో పనిచేస్తూ.. ఎందరోమంది జీవితాల్లో వెలుగులు నింపిన రామోజీరావు అస్తమయం తెలుగు మీడియా రంగానికి, టీవీ పరిశ్రమకు, తెలుగు రాష్ట్రాలకు తీరని లోటన్నారు. రామోజీ రావు ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# ముఖ్యమంత్రి దృష్టికి సింగరేణి సమస్యలు



సమావేశం ఏర్పాటుకు ఐఎన్టియుసి సన్నాహాలు





టైమ్స్ ఆఫ్ వార్త, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి సింగరేణి సమస్యలను విన్నవించేందుకు సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్టీయూసీ) అగ్రనాయకత్వం దృష్టిసారించింది. దీనిలో భాగంగా ముఖ్యమంత్రితో పాటు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర రాష్ట్ర మంత్రులు, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు, ఎంపీ లతో సమావేశం నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరనుంది. సింగరేణిలోని 11 ఏరియాలలో పాత గనులు మూతపడుతున్న దృష్ట్యా సింగరేణి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, వేజ్ బోర్డ్ సభ్యుడు, రాష్ట్ర కనీస వేతన మండలి చైర్మన్ బి జనక ప్రసాద్, సింగరేణ కి సంబంధించి ప్రభుత్వానికి ఓ నివేదిక సమర్పించేందుకు ప్రణాళికలు తయారుచేసినట్లు సమాచారం. నేడో, రేపో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ గా బి జనక్ ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయనున్నారని తెలియవచ్చింది. వెంటనే సింగరేణిలో నూతన గనులు ఏర్పాటు చేయాలని, ఉపాధి అవకాశాలు పెంచాలని, అదేవిధంగా సింగరేణి ఆర్థిక పరిపుష్టి కోసం, ఇతర పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి సారించాలని ప్రభుత్వానికి విన్నవించనున్నారు. ప్రతి సంవత్సరం సంస్థకు నిర్దేశించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను ఉ ద్యోగులు అధిగమిస్తూ, వేలకోట్ల లాభాలు ఆర్జించి పెడుతున్నప్పటికి భారీ గా పడుతున్న ఆదాయ పన్ను(ఐటీ) ఉ ద్యోగుల పాలిట శాపంగా మారిందని, దీనిపై సైతం ఓ నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వాన్ని జనక్ ప్రసాద్ కోరనున్నారు. ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు కోలిండియా మాదిరిగా సింగరేణి ఉద్యోగులకు అలవెన్సుల(పెర్క్స్)పై విధించే ఆదాయపన్ను ను యాజమాన్యమే భరించాలని కోరనున్నారు. కార్మికుల మెడికల్ కార్డు (సిపిఆర్ఎంఎస్) కార్డు పరిమితి 15 లక్షలు పెంచాలని సైతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరనున్నారు. ప్రధానంగా మందమర్రి ఏరియాలో ఇటీవల ప్రజాభిప్రాయ సేకరణ పూర్తయినటువంటి కేకే 6 గనిని ప్రారంభించాలని, 50 నుంచి 75 సంవత్సరాలకు పైగా బొగ్గు నిల్వలు ఉన్నటు వంటి శ్రావణ్ పల్లి ప్రాజెక్టును ప్రారంభించాలని ప్రభుత్వానికి ఆయన విన్నవించనున్నారు. గత బిఆర్ఎస్ పాలనలో సింగరేణి మనుగడ దెబ్బ తినడంతో పాటు నిధులు దారి మళ్లించారని, దీనిని దృష్టిలో పెట్టుకొని డిఎంఎఫ్టి, సిఎస్ఆర్ నిధులతో సింగరేణి పరిసర ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేయాలని సూచించానున్నారు. గత సంవత్సరం సింగరేణిలో జరిగిన కార్మిక గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఆరు ఏరియాలలో విజయం సాధించిన ఐఎన్టీయూసీ కొద్దిపాటి ఓట్ల తేడాతో గుర్తింపు సంఘం హోదాను కోల్పోయింది. అయినప్పటికీ ప్రభుత్వంపై సింగరేణి అభివృద్ధితోపాటు, కార్మిక సంక్షేమమే ఏకైక లక్ష్యంగా ఒత్తిడి తేవడానికి ప్రణాళికలు సిద్ధం చేయడం మంచి పరిణామం అని చెప్పవచ్చు.

## వేణుగోపాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ కు శీతల శవపేటిక అందజేత

టైమ్స్ ఆఫ్ వార్త - నిజామాబాద్ సిటీ





సమాజానికి విస్తృత సేవలు అందిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ 72వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ విశేష సందర్భాన కానుగంటి వంశీ కిరణ్ తన తండ్రి కానుగంటి వేణుగోపాల్ ఫౌండేషన్ సహకారంతో దాతలుగా ముందుకు వచ్చి (50 వేలు విలువ గల) శీతల శవ పేటికను రోటరీ సంస్థ తరపున వినియోగానికి అందజేశారు. గత రెండు దశాబ్దాలకు పైగా జిల్లాలో మొట్టమొదటిసారిగా అందజేసిన ఘనత రోటరీ కే దక్కుతుందని, ఇప్పటికీ కూడా దూర ప్రాంతాల నుంచి చివరి చూపు నోచుకునేందుకు వచ్చే వారి కోసమే శీతల శవ పేటిక ప్రజలందరూ రోటరీ క్లబ్ నే సంప్రదిస్తారని, 24/7 అన్నివేళలా అందుబాటులో ఉంటుందని అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రోటరీ ట్రస్టు చైర్మన్ వేద్ ప్రకాష్ మిట్టల్, గౌరవ అతిథిగా రోటరీ జిల్లా 3150 అసిస్టెంట్ గవర్నర్ వి. శ్రీనివాసరావు హాజరై గత 72 సంవత్సరాలుగా జిల్లాలో చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులైన ఇందూరి శ్రీనివాస్, భరత్ పటేల్, రాజ్కుమార్ సుబేదార్, దర్శన్ సింగ్ సోఖీ, రావులపల్లి జగదీశ్వర రావు, కట్కం శ్రీనివాస్, జ్ఞాన ప్రకాష్, చిలక ప్రకాష్, శ్రీరామ్ సోనీ, బీరేల్లి విజయరావ్, పార్సిరాజేశ్వర్, ధన్పాల్ శ్రీనివాస్, జుగల్ జాజు, శ్యామ్ ఆగర్వాల్, గోపాల్ సోని, వైవి రామ్మోహన్రావు, సుధీర్ గుప్తా, ఆకుల అశోక్, రాధా కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి సిపిఐ నాయకుల చేయూత

టైమ్స్ ఆఫ్ వార్త - ఎల్బీనగర్ ప్రతినిధి:



అంగవైకల్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ఓ దివ్యాంగుడికి చేయూతనందించి తమ వంతు దాతృత్వం చాటుకున్నారు సిపిఐ రాష్ట్ర నాయకులు.వివరాల్లోకి వెళితే అంగవైకల్యంతో ఇబ్బందులకు గురవుతున్న కాటి వీరకుమార్ అనే వ్యక్తి దయానియస్థితి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డిల దృష్టికి రావడంతో ఎలాగైనా ఆ దివ్యాంగుడికి ఏదో ఒక రూపంలో సాయం అందించాలనే ఆలోచన సిపిఐ నాయకుల్లో స్ఫురించింది. తమ ఆలోచనకు కార్యరూపం దాల్చేలా ఓ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఎలక్ట్రికల్ త్రీ వీలర్ సైకిల్ ను తీసుకొని సదరు దివ్యాంగుడైన కాటి వీరకుమార్ కు శనివారం సిపిఐ నాయకుల చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారి ముత్యాల యాదిరెడ్డిలు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ఒక దివ్యంగుడికి మా వంతు ఉడతా భక్తిగా సాయం చేయడం ఆత్మసంతృప్తిని ఇచ్చిందన్నారు.అనంతరం కాటి వీరకుమార్ మాట్లాడుతూ తన పరిస్థితిని తెలుసుకొని తనకోసం చొరవ చూపి తన దైనందిన కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి ఒక మార్గం చూపిన సిపిఐ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ అజ్మీర్ హరి సింగ్ నాయక్, సైదులు ముదిరాజ్, జటావత్ శ్రీను, రాములు, కాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## యూనిఫామ్ అందజేతలో వరంగల్ జిల్లా ముందంజ

21రోజుల్లోనే యూనిపామ్ సిద్ధం

గడువులోపే పాఠశాలలకు చేరిన యూనిఫామ్

ప్రతిభను చాటిన గ్రామైక్య సంఘాల మహిళలు

డిఆర్డిఓ కౌసల్యాదేవిని అభినందించిన సెర్ప్ ప్రిన్సిపల్ సెక్రెటరీ





టైమ్స్ఆఫ్ వార్త-వరంగల్ జిల్లా:

నిర్దేశించిన గడువులోపే ప్రభుత్వ విద్యాసంస్థలకు సమైక్య మహిళల చేత స్కూల్ యూనిఫామ్ కుట్టించి అందజేసి, జిల్లాను రాష్ట్రంలోనే ముందంజలో ఉంచుటకు కృషి చేసిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, డిఆర్డిఓ కౌసల్యాదేవిలను పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ సుల్తాన్య అభినందించారని డీ.ఆర్.డి.ఓ. కౌసల్యదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో విద్యానభ్యసించే విద్యార్థుల యూనిఫామ్ ను ఈ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటి సారిగా ప్రయోగాత్మకంగా (సెర్ప్) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల మహిళలకు బాధ్యతలు అప్పగించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్య సలహాలు సూచనల మేరకు గత నెల 15వ తారీకు రోజున విద్యాశాఖ అధికారుల నుండి యూనిఫామ్ క్లాత్ తీసుకొని తీసుకొని జూన్ ఏడో తారీకు వరకే జిల్లా వ్యాప్తంగా ఉన్న 38,020 మంది విద్యార్థుల యూనిఫామ్ ను కేవలం 21రోజుల్లోనే తయారు చేయించి ఆయా మండలాల విద్యాశాఖ అధికారులకు అప్పగించామని జరిగిందన్నారు. నిర్దేశించిన గడువులోపే సమర్థవంతంగా పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్ అందజేయుటకు అన్ని విధాలుగా పూర్తి సహాయ సహకారాలు అందించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, మండల, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు అన్ని విభాగాల డీపీఎంలకు ఏపీఎంలకు సీసీలకు మాస్టర్ ట్రైనర్స్ కు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## చేప ప్రసాదం పంపిణీలో విషాదం

క్యూ లైన్లో గుండెపోటుతో వ్యక్తి మృతి

టైమ్స్ ఆఫ్ వార్త - హైదరాబాద్ :

హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో శనివారం జరిగిన చేప ప్రసాదం పంపిణీలో విషాదం చోటుచేసుకుంది. క్యూలైన్లో ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. అబిడ్స్ ఏసీపీ చంద్రశేఖర్, వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్కు చెందిన గొల్ల రాజన్న (60) చేప ప్రసాదం వేయించుకోవడానికి మనవడితో కలిసి శుక్రవారం రాత్రి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్కు వచ్చాడు. శనివారం ఉదయం 6:30 గంటల సమయంలో క్యూ లైన్లో స్పృహ కోల్పోయాడు. అతన్ని అంబులెన్స్లో పక్కనే ఉన్న కేర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడు గుండెపోటుతో చనిపోయాడని, అతనికి ఆస్తమా ఉందని వైద్యులు తెలిపారు.

### చేప ప్రసాదం పంపిణీకి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం : మంత్రి పొన్నం

చేప ప్రసాదం పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్తో కలిసి మంత్రి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రికి చేప ప్రసాదాన్ని బత్తిని హరినాథ్ గౌడ్ వేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మృగశిర కార్తె సందర్భంగా ప్రతి యేడు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో బత్తిని కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో చేప ప్రసాదం పంపిణీ జరుగుతోందన్నారు. వివిధ దేశాలు, ఇతర రాష్ట్రాల నుంచి ఈ చేప ప్రసాదం కోసం వస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేప ప్రసాదం కోసం చేప పిల్లలను అందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, బత్తిని సోదరులు అమర్నాథ్ గౌడ్, దుర్గా శంకర్ గౌడ్, గౌరీ శంకర్ గౌడ్ అధికారులు, పాల్గొన్నారు.